క్లుప్తంగా

అన్నసమారాధన



అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎస్సై వాసు

నరసాపురం రూరల్: మొగల్తూరు ప్రజల ఆరాధ్య దేవత నడివీధి ముత్యాలమ్మ జాతర మహోత్సవాలు ముగింపు సందర్భంగా మంగళవారం అన్నసమారాధన ఏర్పాటుచేశారు. మొగల్తూరు విలేకరుల సహకారం, దాతల ఆర్థిక సాయంతో గత తొమ్మిదేళ్లుగా అన్నసమారాధన నిర్వహిస్తున్నారు. గ్రామంలోని భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన నాగారమ్మ జాతర

నరసాపురం: స్థానిక 31వ వార్డులో ఉన్న నాగారమ్మవారి జాతర ఉత్సవాలు ముగిశాయి. వారంరోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేయనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధి బళ్ల తాతాజీ తెలిపారు. భక్తులంతా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోండి

పాలకొల్లు అర్బన్: శ్రీ కృష్ణదేవరాయ కాపు సంఘం, శ్రీ తులసీ రామచంద్రప్రభు, గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో విద్యావంతులైన కాపు, తెలగ, బలిజ యువతకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్టు నియోజకవర్గ కాపు సంఘం కన్వీనర్ వంగా నరసింహరావు తెలిపారు. స్థానిక ముచ్చర్ల శ్రీరామ్ అతిథి గృహం వద్ద, రైల్వే గేట్ వద్ద ఉన్న చవ్వాకుల చారిటబుల్ ట్రస్ట్ వద్ద నుంచి పొందవచ్చని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు చవ్వాకుల నరేష్‌బాబు, కోకన్వీనర్, సెల్ నెంబర్ 949433 7711లో సంప్రదించాలని కోరారు.

ఆకు కూరల పంపిణీ



గవరపేట అంగన్‌వాడీ కేంద్రంలో ఆకు కూరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: గ్రామీణ ఆరోగ్య పోషణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గవరపేట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఆకు కూరలు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్ మంగ మాట్లాడుతూ ఆకు కూరలు ఎక్కువగా భుజించడం వల్ల రక్తహీనత సమస్యలు తలెత్తవని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు విజయకుమారి, ఏఎన్‌ఎం కనకదుర్గ పాల్గొన్నారు.

- ఉల్లంపర్రు పెదపేట అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామ ఆరోగ్య పోషణ కార్యక్రమంలో సేంద్రియ విధానంలో పెంచిన ఆకు కూరలను గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ ఎస్ఎస్ మల్లేశ్వరి, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

డాక్టర్ బాలచందర్‌కు సత్కారం



సత్కారం అందుకొంటున్న బాలచందర్

పెనుగొండ: పెనుగొండకు చెందిన ప్రముఖకవి రచయిత, గాయకుడు ఆస్కా చైర్మన్ డాక్టర్ బాలచందర్ సాదేను విజయవాడకు చెందిన సాహిత్యాభివృద్ధి సంస్థ కళావేదిక తెలుగు కీర్తి పురస్కారంతో ఘనంగా సత్కరించింది. ఈ మేరకు బాలచందర్ మంగళవారం విలేకర్లకు తెలిపారు. సంస్థ సీఈఓ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, బోయి హైమవతి, కన్వీనరు కొల్లి రమావతి, జాతీయ అధ్యక్షురాలు జి.ఈశ్వర భూషణం, జాతీయ ప్రధాన కార్యదర్శి పార్థసారథిలు సత్కరించారని వివరించారు. ఈ సందర్భంగా బాలచందర్‌ను పలువురు అభినందించారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

కాళ్ల: మండలంలో 6 ఏళ్లలోపు వయసు గల పిల్లలు ఉన్న తల్లిదండ్రులు ఆధార్ మొబైల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కాళ్ల ఎంపీడీవో జి స్వాతి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కాళ్ల మండలంలో మూడు చోట్ల ఆధార్ మొబైల్ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు ఆమె మంగళవారం తెలిపారు. ఎనిమిది రోజుల పాటు జరిగే ఈ క్యాంపులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బొండాడ, దొడ్డనపూడి, కోలనపల్లి సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపులను ఆమె పరిశీలించారు. వీటికి సంబంధించి అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లతో పాటు సిబ్బంది సూచనలు ఇచ్చి ఆయా గ్రామాల్లో టామ్ టామ్ ద్వారా ప్రజలకు తెలియపరిచామన్నారు. ఆరు సంవత్సరాల లోపు వయసుగల పిల్లలకు ఆధార్ నమోదు, పేరులో తేడాలు మార్చుకోవచ్చన్నారు.

ప్రమాదాలకు నెలవు.. కళాశాల కూడలి

- పెనుగొండ – మార్టేరు రహదారిలో రద్దీ
- స్పీడు బ్రేకర్లను గుర్తించే లోపే ప్రమాదాలు
- కానరాని హెచ్చరిక బోర్డులు



పెనుగొండలో విద్యార్థులతో రద్దీగా ఉన్న కళాశాల కూడలి



హెచ్చరిక బోర్డులు లేకుండా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు

పెనుగొండ: స్థానిక కళాశాల కూడలి ప్రమాదాలకు నిలయంగా మారింది. పెనుగొండ – మార్టేరు రహదారిలో నరసాపురం కాలువ రోడ్డు ప్రధాన రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక్కడే అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాం, దాదాపుగా నాలుగు వేలకు పైగా విద్యనభ్యసించే కళాశాల ఉన్నాయి. ఇక్కడ ఉదయం, సాయంత్రం వేళల్లో తీవ్రమైన రద్దీ నెలకొంటుంది. ఏడాది క్రితం పెనుగొండ – మార్టేరు రహదారి నిర్మించారు. ఈ నేపథ్యంలో వాహనాల వేగానికి అంతు లేకుండా పోయింది. దీనికి తోడు కళాశాల ముగిసే సమయంలో ఆకతాయిల మోటారు సైకిళ్ల వేగానికి కళ్లెం లేకుండా ఉంది. దీంతో వీరు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. కళాశాల ముగిసే సమయంలో ఇక్కడ పోలీసులు ప్రత్యేక సిబ్బందిని నియమిస్తున్నా.. మిగిలిన సమయాల్లో వేగాన్ని నియంత్రించే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో మితిమీరిన వేగంతో వెళుతున్న మోటారు సైకిళ్లు తరచూ కూడలిలో ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇటీవల ఓ జర్నలిస్టు, మార్టేరు, పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు తీవ్ర గాయాలపాలయ్యారు.

ప్రమాదకరంగా స్పీడు బ్రేకర్లు

ప్రమాదాల నివారణకు రోడ్లు భవనాల శాఖ ఇటీవల రోడ్డు మరమ్మతుల్లో భాగంగా కూడలికి ఇరువైపులా స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేశారు. అవే ఇప్పుడు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ఇక్కడ హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో స్పీడు బ్రేకర్లను గుర్తించే లోపే వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రెండురోజుల్లోనే నలుగురైదుగురు ఆసుపత్రి పాలయ్యారు. ఆదివారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి కోమా దశకు వెళ్లాడు. మంగళవారం టెంపో ట్రావలర్, హోండా కార్లు ఢీకొన్న ఘటనలో రూ.లక్షకు పైగా ఇరువర్గాలకు నష్టం వాటిల్లింది. దీంతో వాహనదారులు హడలి పోతున్నారు. కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని పలువురు కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



స్పీడు బ్రేకర్లతో ప్రమాదాలు పెరిగిపోయాయి. క్షతగాత్రులు ఆసుపత్రి పాలవుతున్నారు. హెచ్చరిక బోర్డులు లేకపోవడం వల్లే ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలి.

– షేక్ పాదుషా, పెనుగొండ

భయపడాల్సి వస్తోంది



కూడలి దాటడానికి భయపడాల్సివస్తుంది. వేగానికి అంతులేకుండా వెళుతున్నారు. స్పీడు బ్రేకర్లు వద్ద ప్రమాదాలు పెరిగిపోయాయి. వేగాన్ని తగ్గించడానికి చర్యలు తీసుకోవాలి. ప్రమాదాలను అరికట్టేందుకు తక్షణం చర్యలు చేపట్టాలి.

– టి.ఈశ్వరరావు, పెనుగొండ

గుండె పోటుతో వీఆర్‌ఓ మృతి





మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీఓ రాజు, తదితరులు
డేవిడ్ రాజు (ఫైల్)

నరసాపురం రూరల్: నరసాపురం మండలం తూర్పుతాళ్లు వీఆర్‌ఓ పల్లికొండ డేవిడ్ రాజు (58) మంగళవారం గుండె పోటుతో మృతి చెందారు. తూర్పుతాళ్లు కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండగా గుండెపోటు రావడంతో డేవిడ్ రాజు కుప్పకూలి పోయారు. తోటి సిబ్బంది ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. డేవిడ్ రాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం డేవిడ్ రాజు మృతదేహాన్ని మొగల్తూరులోని ఆయన స్వగృహానికి తీసుకొచ్చారు. డేవిడ్ మృతదేహానికి ఆర్డీఓ దాసి రాజు, తహసీల్దార్లు రాజరాజేశ్వరి, కె.రాజకిశోర్, ఆర్ఐ మిరియాల లక్ష్మీనారాయణ, స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల ట్రెజరర్ కొండేటి త్రినాథ వెంకటేశ్వరస్వామి, జేవీఆర్, పలువురు వీఆర్వోలు, రేషన్ డీలర్లు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

స్పీడ్ బ్రేకర్లు వేయండి



పట్టణంలో స్పీడ్ బ్రేకర్లు నిర్మించాల్సిన ప్రకాశంరోడ్డు

నరసాపురం: స్థానిక స్టీమర్ రోడ్డు జంక్షన్ వైఎస్సార్ సెంటర్ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు వేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో ప్రతి రోజూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అల్లూరి సత్యనారాయణరాజు మునిసిపల్ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న ఈ ప్రాంతం పట్టణంలో ప్రధాన సెంటర్. పట్టణంలో మొత్తం వ్యాపారమంతా దాదాపు ఇదే ప్రాంతంలో జరుగుతుంది. కూరగాయల మార్కెట్, చేపలు, కిరాణా మార్కెట్‌కు ఈ ప్రాంతం నుంచే వెళ్లాలి. ముఖ్యంగా పలు కళాశాలల విద్యార్థులు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రాంతంలో రద్దీ దృష్ట్యా స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

రైల్వే స్టేషన్ రోడ్డులో ట్రాఫికర్



రైల్వే స్టేషన్ రోడ్డులో ఇరువైపులా పార్కింగ్ చేసిన ప్రైవేట్ వాహనాలు

నరసాపురం: స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో ప్రైవేట్ వాహనాల ఇష్టానుసారం నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రైల్వే స్టేషన్ రోడ్డులో ఇటీవల రద్దీ బాగా పెరిగింది. పాలకొల్లు రోడ్డు విపరీతమైన రద్దీతో ఉండటంతో, చాలామంది ప్రత్యామ్నాయంగా ఈ రోడ్డులో ప్రయాణిస్తున్నారు. మూడేళ్ల క్రితం స్టేషన్ పక్క నుంచి సరిపల్లి మీదుగా బైపాస్ కూడా నిర్మించారు. దీంతో రద్దీ బాగా పెరిగింది. అయితే ఈ రోడ్డులో ప్రైవేట్ బస్సులు, రొయ్యల కంపెనీలు, ఇతర ప్రైవేట్ వాహనాలను ఇరువైపులా నిలిపి ఉంచుతున్నారు. బస్సులను ఇక్కడే కడుగుతుండడంతో రోడ్డు పక్కన బురదమయంగా ఉంటుంది. రోడ్డు మార్జిన్లు కూడా పాడైపోతున్నాయి. ప్రైవేట్ బస్సులు నిలిపి ఉంచడానికి ప్రత్యేకంగా ఎక్కడైనా స్థలం కేటాయించాలని, ఈ రోడ్డులో ట్రాఫిక్ సమస్య పరిష్కార మయ్యేలా మున్సిపల్, పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు



కొప్పర్రులో ఆధార్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ ప్రభాకర్

నరసాపురం రూరల్: విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని నరసాపురం డీఎల్‌డీఓ ప్రభాకర్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల అమలులో నిర్లక్ష్యంగా ఉంటే సహించబోమన్నారు. ప్రభుత్వం అప్పగించిన పనులను నూరుశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం నరసాపురం మండలం కొప్పర్రు గ్రామ సచివాలయంలో ఏర్పాటుచేసిన ఆధార్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీఓ గాదిరాజు రామకృష్ణంరాజు, కొప్పర్రు గ్రామ కార్యదర్శి బొర్రా ఆనందబాబు, జూనియర్ అసిస్టెంట్ సురేష్ తదితరులు ఉన్నారు.

98 పశువులకు వైద్య పరీక్షలు



కాజ తూర్పులో పశువుల మందులు అందిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

యలమంచిలి: పాడి రైతులంతా పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కాజ తూర్పు సర్పంచ్ పాలంకి శ్రీనివాసరావు కోరారు. కాజ తూర్పు, కాజ పడమర గ్రామాల్లో పశు వైద్య శాఖ అధికారులు మంగళవారం పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. సర్పంచ్‌లు పాలంకి శ్రీనివాసరావు, గుబ్బల వేణుగోపాలస్వామిలు రైతులకు పశువుల మందులు అందజేశారు. ఈ శిబిరాల్లో 98 పశువులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్టు మండల వైద్యాధికారి పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఈ శిబిరాలు బుధవారం మట్లపాలెం, ఇలపకుర్రు గ్రామాల్లో నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ శిబిరాల నిర్వహణకు పశు సంవర్ధక సహాయకులు నిల్లా సత్యశ్రీ, షబీర, సునంద, భవాని, దొరబాబు, వెంకన్నబాబు, తరుణ్‌లు సహకరించారు. కార్యక్రమంలో ఊటాడ సర్పంచ్ కొక్కిరిగడ్డ రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు జిల్లెళ్ల రత్నంరాజు, పాలంకి నాయుడు, చించినాడ జయశ్రీను తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి రూ.50 వేల విరాళం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మ అమ్మవారికి హైదరాబాద్‌కి చెందిన చింతలపాటి సుభాస్ చంద్ర బోసు రాజు రూ.50 వేలు కానుకగా అందజేశారు. వీరికి ఆలయ ఉప ప్రధాన అర్చకుడు కొప్పేశ్వరరావు పూజలు, ఆశీర్వచనాలు నిర్వహించి శేషవస్త్రం ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ సహాయకులకు శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న ఏపీడీసీబీ కనకదుర్గ

పెనుమంట్ర: తణుకు క్లస్టర్ పరిధిలో పెనుమంట్ర, పోడూరు మండలాలకు చెందిన అన్ని పంచాయతీల ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సహాయకులకు పెనుమంట్ర మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీడీసీబీ జె.కనకదుర్గ హాజరై శిక్షణ ఉద్దేశాన్ని వివరించారు. రానున్న ఆరు నెలలు కాలంలో ఆయా పంచాయతీల్లో చేపట్టాల్సిన వ్యవసాయ అనుసంధాన పనులను వివరిస్తూ పంచాయతీ వారీగా యాక్షన్ ప్లాన్ ప్రిపరేషన్‌ను తెలియజేశారు. డీఆర్‌పీలుగా శ్యామ్, రంగరాజు, కె.శ్రీను క్షేత్రస్థాయి సహాయకులకు శిక్షణ అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బీవీఎస్ శర్మ, తణుకు క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఏవీవీఎస్ ప్రసాద్, ఏపీఎంఓ ఎం బాపూజీ పాల్గొన్నారు.

2 వరకు లెప్రసీపై ఇంటింటా సర్వే



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మెడికల్ ఆఫీసర్ ప్రతాప్‌కుమార్

పాలకొల్లు అర్బన్: లెప్రసీ నివారణ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఇంటింట సర్వే నిర్వహిస్తున్నామని, ఈ సర్వేకి ప్రతి ఒక్కరూ సహకరించాలని మెడికల్ ఆఫీసర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ కోరారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో మంగళవారం లెప్రసీ నివారణ మాసోత్సవ అవగాహన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. చర్మంపై స్పర్శలేని రాగి రంగు మచ్చలు, కనురెప్పలపై వెంట్రుకలు రాలిపోవుట, అరికాళ్లు, అరచేతులు స్పర్శ కోల్పోవటం, చేతుల నుంచి వస్తువుల జారిపోవుట, కాళ్ల నుంచి చెప్పులు జారిపోవుట, చేతి వేళ్లు, కాళ్ల వేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం లెప్రసీ వ్యాధి లక్షణాలని వివరించారు. మెడికల్ ఆఫీసర్ ఎం నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి.ఎలిజబెత్, ఫార్మాసిస్ట్ పీవీ స్వామి, స్టాఫ్ నర్సులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల వ్యాకరణావధానం చరిత్రాత్మక ఘట్టం



హారికను సత్కరిస్తున్న కవులు, కళాశాల పాలకవర్గం

పెనుగొండ: తెలుగు సాహిత్య చరిత్రలో బాల వ్యాకరణావధానం గొప్ప చరిత్రాత్మక ఘట్టమని సహస్రావధాని డాక్టర్ కడిమెళ్ల వరప్రసాద్ అన్నారు. మంగళవారం పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో తెలుగు భాషకు ప్రామాణిక వ్యాకరణంగా పేర్గాంచిన బాల వ్యాకరణం మూల సూత్రాల దారణ అవధానాన్ని పోడూరు మండలం మినిమించిలి పాడులోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న ముక్కే హారిక సునాయాసంగా అవధానం నిర్వహించి ఆకట్టుకొంది. ఇలాటి అవధానం అపూర్వకమని అభివర్ణించారు. తాను ఇప్పటి వరకు 1100 అవధానాలు చేశానని, తొలి అవధానం 1978లో ఎస్వీకేపీలో చేశామనని చెప్పారు. అదే ప్రోత్సాహం హారికకు లభించిందని, ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి నాంది పడిందని తెలిపారు. ఇతర విద్యార్థులకు స్ఫూర్తి దాయకంగా నిలిచిందని కొనియాడారు. ఎస్వీకేపీ విద్యా సంస్థల పాలకవర్గ సెక్రటరీ కరస్పాండెంట్ కె.రామచంద్రరాజు మాట్లాడుతూ కళాశాలలో చిన్న వయస్సులోనే హారిక చారిత్రక ఘటానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఎందరో విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. హారిక విద్యా భ్యాసానికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వైవీవీ అప్పారావు, పాలక వర్గ అధ్యక్షుడు తాడి నాగిరెడ్డి, ఆచార్య డాక్టర్ రంకిరెడ్డి రామ్మోహనరావు, సంయుక్త కార్యదర్శి పెనుమత్స వెంకట సుబ్రహ్మణ్యం రాజు, మినిమించిలి పాడు సర్పంచ్ నామన వీర్రాజు, సంకురాత్రి సూర్యనారాయణ, కర్రి సురేష్ బాబు, సుబ్బారావు, షేక్ ఆదం షాలు పాల్గొన్నారు.

శ్యామలాదేవికి సత్కారం

భీమవరం (ప్రకాశంచౌక్): కేంద్ర మాజీ మంత్రి కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవిని స్వచ్ఛంద సంస్థ సభ్యులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, డీటీడీసీ బాబు, లయన్స్ కృష్ణంరాజు సత్కరించారు. ఉచిత మెగా షుగర్ మెడికల్ క్యాంప్‌తో శ్యామలాదేవి, వారి కుటుంబ సభ్యులు అందజేసిన సేవలు అద్వితీయమని అన్నారు. కృష్ణంరాజు ఆశయాలకు అనుగుణంగా వారి సతీమణి కుటుంబ సభ్యులు పేదలకు నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం మహా యజ్ఞంలా సాగిందని, ఇటువంటి శిబిరాలు మరెన్నో ఏర్పాటు చేయాలని వారు కోరారు.

ఆదర్శ మునిసిపాలిటీగా తీర్చిదిద్దుతాం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్: రాష్ట్రంలో పాలకొల్లును ఆదర్శ మునిసిపాల్టీగా తీర్చిదిద్దడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. పాలకొల్లు మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత టిడ్కో గృహాలు, 100 పడకల ప్రభుత్వాసుపత్రి నిర్మాణ పనులు, డయాలసిస్ట్ సెంటర్, ఎంపీడీఓ కార్యాలయం వద్ద క్రైస్తవ, హిందూ శ్మశాన వాటికలు, రామగుండం పార్కు, డాక్టర్ అబ్దుల్ కలాం పార్కు, ఎన్టీఆర్ కళాక్షేత్రం పనులను ఆయన పరిశీలించారు. పనుల పురోగతిపై ఆరా తీశారు. ఆర్డీఓ దాసి రాజు, మునిసిపల్ కమిషనర్ బి.వి జయసారథి, డీఈలు కె.రాజ్‌కుమార్, టూరిజం డీఈ జి.సత్యనారాయణ, టీపీఓ కె.వీరబ్రహ్మం, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

షైనీకి ఇంటర్నేషనల్ పురస్కారం

ఆకివీడు: అంతర్జాతీయ కరాటే ప్రతిభా పురస్కార అవార్డును మండలంలోని అజ్జమూరుకు చెందిన గంటా షైనీ మంగళవారం పొందారు. హైదరాబాద్‌లో కేశవ్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ పోటీల్లో ఈ పురస్కారం లభించినట్లు ఆమె తండ్రి కరాటే మాస్టర్ గంటా శ్రీను తెలిపారు. పోటీల్లో 19 దేశాలకు చెందినవారు పురస్కారాల్ని అందుకున్నట్లు చెప్పారు.

పంచాయతీ కార్యదర్శికి అభినందనలు

నరసాపురం రూరల్: మొగల్తూరు గ్రామ పంచాయతీలో ఇంటి పన్నులు పూర్తిస్థాయిలో వసూలు చేసిన గ్రామ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు (చిన్నా)ను అధికారులు మంగళవారం అభినందించారు. 2024-25 ఆర్థిక సంవత్సర పన్ను డిమాండ్ రూ.50,16,776ను వసూలు చేసినందుకు ఎంపీడీఓ త్రిశూల పాణి, ఈవోపీఆర్డీ నవీన్ కిరణ్‌లు చిన్నాను అభినందించారు.

రీసర్వే పారదర్శకంగా ఉండాలి



కేపీపాలెంలో రీసర్వే చేస్తున్న అధికారులు, సిబ్బంది

నరసాపురం రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన భూముల రీసర్వే పారదర్శకంగా ఉండాలని తహసీల్దార్ కె.రాజకిశోర్ ఆదేశించారు. నరసాపురం మండలం కేపీపాలెం గ్రామంలో మంగళవారం రీసర్వే చేపట్టారు. గ్రామస్తులు, రైతులు, స్థలం వివాదంలో ఉన్నవారు రీ సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ నాగేశ్వరరావు, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

కుల గణన అభ్యంతరాల సమయం పెంచాలి

పెనుగొండ: ఎస్సీ, ఎస్టీ కులగణన వివరాలు వెల్లడించడంలో సచివాలయాలు విఫలమయ్యాయని, వాటిపై తీసుకొనే అభ్యంతరాలకు సమయం పెంచాలని ఏపీ కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కమిటీ సభ్యుడు కప్పల రత్నరాజు డిమాండ్ చేశారు. మంగళవారం సిద్ధాంతంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎస్సీల్లో ఉన్న 59 ఉపకులాలు, 32 తెగల గురించి అవగాహన లేని సచివాలయ సిబ్బందితో సర్వే చేయడంతో అనేక పొరపాట్లు, తప్పులు దొర్లాయని చెప్పారు. వారి జీవన స్థితిగతులను అంచనా వేయడంలో సర్వే సమగ్ర రూపం ఇవ్వలేక పోయిందన్నారు. దీంతో అభ్యంతరాలకు తగిన సమయం ఇవ్వాల్సి ఉందని తెలిపారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కమిటీ సభ్యుడు షేక్ పాదుషా, సీఐటీయూ నాయకులు నీలాపు ఆదినారాయణ పాల్గొన్నారు.

23 నుంచి పింఛన్ల పరిశీలన

పెనుమంట్ర: మండలంలో ఈనెల 23 నుండి 25 వరకు రీ ఎస్సైన్‌మెంట్ ఆఫ్ హెల్త్ అండ్ డిజేబులిటి పెన్షన్ల వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బీవీఎస్ శర్మ మంగళవారం తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీం లబ్ధిపొందుతున్న మండలంలోని 18 గ్రామాలకు 91 మందిని పరిశీలించనున్నట్టు పేర్కొన్నారు. 23న ఎస్ ఇల్లిందలపర్రు, మల్లిపూడి, జుత్తిగ, నత్తారామేశ్వరం, మాముడూరు, పొలమూరు గ్రామాలు, 24న వెలగలవారిపాలెం, పెనుమంట్ర, భట్లమగుటూరు, ఆలమూరు, ఓడూరు, నెలమూరు, 25 న సత్యవరం, మార్టేరు, నెగ్గిపూడి, గ్రామాల్లోని క్షేత్రస్థాయిలో వైద్యాధికారులు పరిశీలన చేస్తారని వివరించారు.